క్లుప్తంగా

ఇనుప పైపులు మీదపడి కార్మికుడు మృతి

నార్కట్‌పల్లి: ఇనుప పైపులు మీదపడి కార్మికుడు మృతిచెందిన ఘటన నార్కట్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం సమీపంలోని యూఎస్‌టీఎల్ కంపెనీలో బిహార్ రాష్ట్రానికి చెందిన సత్యేంద్రకుమార్ (39) పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి విధులకు హాజరయ్యాడు. పనిచేస్తున్న క్రమంలో ఇనుప పైపులు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది చందన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదబాబు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్త హత్యకు కుట్ర

నల్లగొండ క్రైం : వివాహేతర సంబంధానికి అడ్డు చెబుతున్నాడని భర్తను హతమార్చేందుకు భార్య తన ప్రియుడితో కలిసి కుట్ర పన్నింది. ఈ సంఘటన నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలో శనివారం చోటుచేసుకుంది. గొల్లగూడకు చెందిన సహేదా పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేసే నవీన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయంలో భార్య సహేదాకు భర్త ఇస్మాయిల్ అడ్డు చెప్పాడు. దీంతో సహేదా, నవీన్ కలిసి ఇస్మాయిల్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. శనివారం ఇస్మాయిల్‌ను అతని ఇంట్లోనే నిర్బంధించి సహేదా, నవీన్ చిత్రహింసలు పెట్టారు. ఇంట్లో అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇస్మాయిల్‌ను విడిపించారు. ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సహేదా, నవీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామపరిధి గాదిరెడ్డిపల్లిలో శనివారం విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. గాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తీగల క్రిష్టారావు గేదె గ్రామంలోని నివాస గృహాల మధ్య గడ్డి మేస్తూ అక్కడే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని, తనను ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరుతున్నాడు.

శాలిగౌరారంలో మరొకటి..

శాలిగౌరారం: మేత మేసుకుంటూ వెళ్లిన గేదె విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మండలంలోని భైరవునిబండలో శనివారం జరిగింది. భైరవునిబండ గ్రామానికి చెందిన దండంపల్లి యాదయ్య తన గేదెలను మేపేందుకు వ్యవసాయ పొలం వద్దకు తోలుకుపోయాడు. ఈ క్రమంలో పొలంలో మేత మేస్తున్న ఒక గేదె సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

సినారె జయంతి వేడుకలు



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ సంఘం సభ్యులు

రామగిరి(నల్లగొండ): మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి 92వ జయంతి వేడుకలను నల్లగొండలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినారె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినారె రచించిన గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం సభ్యులు మోహన్‌రావు, గజవెల్లి సత్యం, యాదవాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మహిళలకు కేంద్రం రక్షణ కల్పించాలి

రామగిరి(నల్లగొండ): మణిపూర్‌లోని మహిళలు, క్రైస్తవులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా నల్లగొండలో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై దాడులకు పాల్పడుతున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేకల భద్రాద్రి, పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్. ఐజాక్‌రామ్, ఎస్. కన్నా డేవిడ్, పి. జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో పాఠశాల విద్య

రామగిరి(నల్లగొండ): తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలో ఉందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కొరత వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ గాడి తప్పుతోందన్నారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఆగిపోయిందని అన్నారు. పీఆర్సీ వేసి వీలైనంత తొందరగా నివేదికను పూర్తిచేయాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..?

- నాలుగేళ్లవుతున్నా..
  ఇంకా కొనసాగుతున్న పనులు

మునుగోడు: ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అన్ని హంగులతో అంబేడ్కర్ భవనాల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం ఒక్కో భవన నిర్మాణానికి రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేసింది. మునుగోడు నియోజకవర్గంలో ఈ భవన నిర్మాణానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నుంచి 2018 సెప్టెంబర్‌లో రూ.కోటి కేటాయించారు. ఆ నిధులతో 3గుంటల స్థలంలో 79 ఫీట్ల పొడవు, 35 ఫీట్ల వెడల్పుతో భవన నిర్మాణం చేపట్టేందుకు 2020లో పునాది పనులు ప్రారంభించారు. దాదాపు రెండేళ్లకు పైగా పనులు కొనసాగిస్తున్నా నేటికీ భవన నిర్మాణం పూర్తికాలేదు. శిలాఫలకం ఏర్పాటు చేసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తయ్యేవి. ఆ పనులు పూర్తయితే అంబేడ్కర్ భవనంలో దళిత కుటుంబాలకు చెందినవారు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు ఏమైనా శుభకార్యాలు చేసుకునేందుకు ఉపయోగపడేది. కానీ అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ అలసత్వమో కానీ ఆ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మునుగోడులో అసంపూర్తిగా అంబేడ్కర్ భవనం

అదనపు నిధులు అవసరం



అంబేడ్కర్ భవన నిర్మాణానికి మంజూరైన రూ.కోటి నిధులతో పనులు పూర్తిచేయించాం. మిగిలిన ప్లాస్టింగ్, ఫ్లోరింగ్‌తో పాటు విద్యుత్ వైర్ల ఏర్పాటు, రంగులు వేసేందుకు రూ.60లక్షలు కావాలని ప్రతిపాదనలు పంపాం. ఆ నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తిచేయిస్తాం.
– రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ

పనులు త్వరగా పూర్తిచేయాలి



నాలుగేళ్ల క్రితం పనులు మొదలుపెట్టినా నేటికీ పూర్తి చేయలేదు. ఇప్పటికే నిర్మాణం పూర్తయితే అందరికీ సంతోషంగా ఉండేది. ఇప్పటికైయినా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయించి దళితులు అంబేడ్కర్ భవనాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలి.
– దుబ్బ రాజశేఖర్

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

చిట్యాల: వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. చిట్యాల పట్టణంతో పాటు మండల పరిధిలోని ఉరుమడ్ల గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని గొల్కొండ ప్రాంతానికి చెందిన నల్లె అజయ్‌కుమార్(26) ఫీలిం ఇండస్ట్రీలో దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నాడు. అజయ్‌కుమార్ ఏడేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన రజనీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రజని పుట్టింటికి వచ్చింది. అజయ్‌కుమార్ సైతం భార్య దగ్గరికి వెళ్లి శనివారం తిరుగు ప్రయాణంలో చిట్యాలకు చేరుకున్నాడు. స్థానిక జాతీయ రహదారి పక్కన పాల కేంద్రం ఎదురుగా గల గణపతి లాడ్జిలో దిగాడు. ఆ తర్వాత లాడ్జి నుంచి కిందకు వచ్చిన అజయ్‌కుమార్ ఆ పక్కనే ఉన్న వారితో తాను ఫీలిం ఇండస్ట్రీలో దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నాడు. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి మూడున్నర గంటల సమయంలో తన స్నేహితులకు వీడియో కాల్ చేసి తాను ఉరి వేసుకుంటున్నట్లు చెప్పాడు. అనంతరం లాడ్జిలోని తన గదిలో బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి స్నేహితులు వెంటనే లాడ్జి లొకేషన్ తెలుసుకుని నిర్వాహకులకు ఫోన్ చేశారు. లాడ్జిలో పనిచేసే బాయ్ అజయ్‌కుమార్ గది వద్దకు వెళ్లి చూసేటప్పటికి మృతిచెంది ఉన్నాడు. లాడ్జి నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో చిట్యాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు తెలియపర్చి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

ఉరుమడ్లలో..



యాదయ్య (ఫైల్)

చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన సామ యాదయ్య(62) కొంతకాలంగా ఏ పనిచేయకుండా, బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఒంటరిగా ఉంటున్నాడు. అంతే కాకుండా తనకు చనిపోవాలని ఉందంటూ భార్య రాములమ్మకు తరచుగా చెపుతుండేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సిమెంటు పైకప్పు రేకులకు తన లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె పిశాటి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



నల్లగొండలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు



నల్లగొండ పట్టణంలో పీర్లను ఊరేగిస్తున్న ప్రజలు



నకిరేకల్: పీర్లను ఎత్తుకుని నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మునుగోడులో పీర్లని ఊరేగిస్తున్న భక్తులు

నకిరేకల్: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మొహర్రం సందర్భంగా శనివారం రాత్రి నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్ గూడెంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ నుంచి పానగల్లు వరకు ఊరేగింపు

రామగిరి(నల్లగొండ): మొహర్రం పండుగను నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్తీలోని చోటే లాల్ సాహెబ్, బడే లాల్ సాహెబ్‌ల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పానగల్లు వరకు పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల..

నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాతబస్తీ నందు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ముస్లిం నాయకులు హన్ను, జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు: మండల వ్యాప్తంగా శనివారం మొహర్రం వేడుకలను మతాలకతీతంగా హిందూ ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

చండూరులో..

చండూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా చండూరు మండలం ఇడికుడలో శనివారం నిర్వహించిన పెద్ద సరగత్ కార్యక్రమంలో రాష్ట్ర గీతకార్మిక అభివృద్ధి సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు రవికుమార్‌కు దట్టీ కట్టి పగడి సవార్లతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఘని, మాజీ సర్పంచ్ పంతంగి వీరయ్య, పరమేష్, గిరి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్: మొహర్రం వేడుకలను మండల ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఎరసానిగూడెం, పరడ, బొల్లేపల్లి, ఈదులూరు, పిట్టంపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లోని బావుల్లో పీర్లను నిమజ్జనం చేశారు.

చిట్యాలలో..

చిట్యాల: మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం చిట్యాల పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ గోధుమగడ్డ పద్మాజలంధర్‌రెడ్డి పీర్లకు దట్టీలు కట్టి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కోతి జ్యోతీవెంకట్‌రెడ్డి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోధుమగడ్డ మల్లారెడ్డి, అన్వర్, ముక్రం పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మొహర్రం వేడుకలను మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. భైరవునిబండ గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లిలో మొహర్రం వేడుకల్లో టీపీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో బండి హన్మంతు, భీమనగాని యాదయ్య, వెన్నమనేని సుధాకర్‌రావు, యాదగిరిరావు, ఊర భూపతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూర్: ఎరసానిగూడెంలో పీర్లను ఊరేగిస్తున్న ప్రజలు



శాలిగౌరారం: భైరవునిబండ గ్రామంలో పీర్ల ఊరేగింపులో గ్రామస్తులు



చండూరు: ఇడికూడ గ్రామంలో పీర్లను ఎత్తుకున్న పల్లె రవికుమార్‌గౌడ్

కష్టపడి పనిచేస్తేనే తగిన గుర్తింపు

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సిరిపంగి నర్సింహ, నందిపాటి అరుణ్, మేడి శివప్రసాద్, సిరిపంగి మధు, నరేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేడి శ్రీను, నర్రా శ్రీకాంత్‌రెడ్డి, మేడి రాజు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన భువనగిరి రేణుక అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో రూ.2.5లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని శనివారం ఎమ్మెల్యే నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్ల క్రిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, ఇనుపాముల శివాలయ చైర్మన్ కానుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

రామగిరి(నల్లగొండ): తెలంగాణలో క్రైస్తవుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియం నందు నల్లగొండ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్త్రీల ఉజ్జీవన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో క్రైస్తవులు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ జేపి ప్రభుత్వం వచ్చాక క్రైస్తవులపై దాడులు పెరిగాయన్నారు. బీజేపీ మతాల మధ్య చిచ్చుపెట్టి రాక్షసానందం పొందుతుందని విమర్శించారు. అనంతరం న్యూ బ్లోసమ్ మినిస్ట్రీస్ ఫౌండర్ డాక్టర్ థెరిసా పాల్ రచించిన పునరుద్ధరణ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి, నల్లగొండ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఐజాక్‌రామ్, ప్రధాన కార్యదర్శి ఎస్. కన్నా డేవిడ్, కోశాధికారి బి. జానుబాబు, గౌరవ అధ్యక్షుడు కె. మోజెస్, గౌరవ సలహాదారులు ఎస్. లాజరస్, జాయింట్ సెక్రటరీ డి. ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

కేసీఆర్ పాలనలోనే పేదలకు మెరుగైన వైద్యం

మునుగోడు: సీఎం కేసీఆర్ పరిపాలనలోనే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని రాష్ట్ర గీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన దొడ్డి కాంతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా పల్లె రవికుమార్ చొరవతో రూ.25వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును శనివారం పల్లె రవికుమార్ మునుగోడులో లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇవ్వని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోగుల ప్రకాష్, బొడ్డు నాగరాజుగౌడ్, ఈదులకంటి కైలాస్‌గౌడ్, గుంటోజు వెంకటచారి, జంగిలి నాగరాజు, పందుల మల్లేష్, తిరిపారి వెంకటేశ్వర్లు, భేరి క్రిష్టయ్య, సాగర్ల లింగస్వామి, రేవెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

- **వినూత్న నిరసన**

తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నల్లగొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు.
– సాక్షి నెట్‌వర్క్



రామగిరి: తిప్పర్తిలో ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



మర్రిగూడ: గొర్రెపొట్టేలుకు వినతిపత్రం అందచేస్తున్న పంచాయతీ కార్మికులు



కేతేపల్లి: గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

'విద్యా మహోత్సవం'ను జయప్రదం చేయాలి

నల్లగొండ: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, జిల్లా ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న విద్యా మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గాంధీ సంస్థల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు, నీట్ , జేఈఈ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు, 10 జీపీఏ సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అభినందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను కూడా సన్మానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రావు, కోశాధికారి మట్ట చెన్నయ్యగౌడ్, ప్రచార కార్యదర్శి గిరిధర్‌గౌడ్, అజీం, నర్సింహ, రవీందర్‌గౌడ్, జ్యోతి, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గొల్ల కురుమల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చండూరు(గట్టుప్పల్): గొల్ల కురుమల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టుబడి ఉన్నారని చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్ అన్నారు. శనివారం ఆమె గట్టుప్పల్ మండలంలోని శేరిగూడెం, మద్దివారిగూడెం గ్రామాల్లో లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మ, డాక్టర్ బాలకృష్ణ, లబ్ధిదారులు మద్ది మల్లేశం, అండాలు, మారయ్య, జ్యోతి, నర్సింహ, వెంకన్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ సట్టు సైదులు కుటుంబాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శనివారం పరామర్శించారు. సైదులు కుమారుడు మహేశ్ నల్లగొండ పట్టణ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మహేశ్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, స్థానిక సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఎంపీటీసీ మాదగోని కవితరామలింగయ్య తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి గ్రామపంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెం వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో గ్రామ రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కలిగే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొట్టెల రమేష్, జాకటి మోష, నలపరాజు శ్రీనివాస్, ఉయ్యాల నాగరాజు, వల్లపురెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలని వినతి

కనగల్: మండల పరిధిలోని జి. యడవల్లి గ్రామ సెంటర్‌లో బస్ షెల్టర్ నిర్మించాలని యడవల్లి యూత్ అసోసియేషన్ సభ్యులు శనివారం గ్రామ సర్పంచ్ పులకరం యాదమ్మకు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామంలో దేవాలయ పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దోటి సైదులు, భిక్షమాచారి, వెంకటాచారి, శ్రీను, స్వామి, రాఘవచారి, అనిల్ తదితరులున్నారు.

నల్లగొండ ఆర్డీఓకు సన్మానం

నల్లగొండ: నల్లగొండ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన రవిని శనివారం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కలిసి ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్, సుదర్శన్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

హెచ్ఈఓ రాష్ట్ర కమిటీ ఎన్నిక

నకిరేకల్: ఉద్యాన విస్తరణ ఉద్యోగుల(హెచ్ఈఓ) సంఘం రాష్ట్ర కమిటీని శనివారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎనుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్లు సైదులు, ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్‌రెడ్డి, సంధ్య జోషి, ప్రధాన కార్యదర్శులుగా బండి వేణుకుమార్, బగారి లక్ష్మయ్య, కోశాధికారిగా మండెం రుక్మిణి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గాదె శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, బానోతు లాలు, చాట్ల భూమయ్య, సభ్యులుగా అడిదల లింగారెడ్డి, సతీష్, రాజేశ్వర్, విఠల్ ఎన్నికయ్యారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

చండూరు: మండలం పరిధిలోని ఉడతలపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం రూ.30వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎస్‌ఐ సురేష్‌కు నగదు అందజేశారు. గ్రామానికి చెందిన మరికొంత మంది సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అందించాలని ఆయన కోరారు.

మంత్రి జగదీష్‌రెడ్డికి వినతి

చండూరు: గట్టుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌కు పూర్తిస్థాయి అధికారాలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం తెలిపారు. అదేవిధంగా ధర్మతండాలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని.. మరమ్మతులు చేపట్టాలని, గట్టుప్పల్ మండల కేంద్రంలో మరో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 50 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. సర్వే నంబర్ 32లో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీ రద్దు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమగాని మహేష్ పాల్గొన్నారు.

వర్షాలకు తడిసి కూలిన పెంకుటిల్లు

శాలిగౌరారం: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన గుండా రామ్మూర్తి పెంకుటిల్లు తడిసి శనివారం తెల్లవారుజామున కూలిపోయింది. ఆ సమయంలో ఇంటి ముందు భాగంలో ఉన్న రేకుల గదిలో నిద్రిస్తున్న రాంమ్మూర్తి, అతడి భార్య, కుమార్తె ఒక్కసారిగా శబ్దం రావడంతో నిద్రలోంచి మేల్కొని బయటకు పరుగులు తీశారు. రోజూ పెంకుల గదిలో నిద్రించే రామ్మూర్తి కుటుంబ సభ్యులు శుక్రవారం రేకుల గదిలో నిద్రించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

కేతేపల్లి: మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వట్టి వీరయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. వీరయ్య మృతదేహానికి టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్ నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌యాదవ్, నాయకులు బొబ్బిలి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామానికి చెందిన జక్కల శ్రీను అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. గ్రామానికి చెందిన అతడి స్నేహితులు శ్రీను కుటుంబానికి సాయం చేయాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయగా, చాలామంది స్పందించి రూ.60వేల వరకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. ఈ నగదును శనివారం శ్రీను కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో కారింగు సతీష్, కడారి కిరణ్, గోలి నవీన్, చింతకింది ముత్తయ్య, జక్కలి రాంబాబు తదితరులున్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన ఎర్రజెల్ల వెంకన్న అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు రూ.10,000, స్థానిక జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ రూ.5000 ఆర్థికసాయం అందజేశారు.

పైపులైన్‌కు సర్పంచ్ మరమ్మతులు

కనగల్: మండల పరిధిలోని పగిడిమర్రిలో తాగునీటి పైప్‌లైన్ పగలడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శనివారం స్వయంగా గ్రామ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి గుంత తీసి పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.